# ప్రసాదం

**అజీజ్**

## "నా యెద చేరువలో..."

కళ్యాణిరాగం...సరిక్రొత్తబాణీ. పంతులుగారు మధురంగా పాడుతున్నారు. ఆయన పాడిందానికి ఆయనే ఆశ్చర్యపడుతూ, ఆనందిస్తూ పాడుతున్నారు.

"ఎంత బాగుందోయ్ పాట...?" అన్నారు కొద్ది సేపటికి.

శకుంతల నవ్వింది. ఇలా నవ్వటం ఆమెకు అలవాటయిపోయింది.

"మరి నేను వెళ్ళిరానా?" లేచి నుంచుంటూ అడిగా.

పంతులుగారు తన్మయత్వంలో ఉంటూనే తల ఆడించారు. 'బ్రతికానురా' అనుకుంటూ బయలుదేరా. అంతసేపు బాధను కలిపి భరించాం—నేనూ, శకుంతల. ఇప్పుడు శకుంతల ఒక్కర్తె మీదనే పూర్తి భారం.....

శకుంతల తహశీల్దారుగారి కూతురు. వాళ్ళింట్లోనే ఒక భాగంలో పంతులుగారు, మరో భాగంలో నేనూ అద్దె కుంటున్నాం. అద్దె కట్టటానికి బదులు శకుంతలకు సంగీతం నేర్పుతున్నారు పంతులుగారు.

అనుకోకుండా ఒకరోజున శకుంతల నా గది దగ్గరకు వచ్చింది.

"ఏవైనా క్రొత్త పాటలు వ్రాశారేమో కనుక్కు రమ్మంటున్నారు. ..." అంది.

"ఏమీ వ్రాయలేదే .... !" అన్నా.

ఇంతలో పంతులుగారే వేంచేశారు.

"అదేంటి ? వ్రాయమని చెప్పానే నిన్న—?" అంటూ—

"ఇవాళ వ్రాస్తాను .... అసలేదీ టైం లేందే!"

"వ్రాసింతరువాత తప్పించుకోలేవు ! నా ప్రక్కనే ఒక గంటసేపు కూర్చున్నావంటే అద్భుతమైన రాగం అతికిస్తాను .... !"

శకుంతల నవ్వింది.

ఆమెకు తెలుసు నా బాధ—పంతులుగారి ప్రక్కన ఒక గంట కూర్చుంటే ఎలా ఉంటుందో.

"అలాగేనండి .... !"

"ఒక్క గంటే—పద శకుంతలా—!"

పంతులుగారు వెళ్ళిపోతుంటే ప్రాణం తేలికయింది.

ఆయనగారక్కడ రెండేళ్ళనుంచీ ఉంటున్నారు. ఎవ్వరూ లేరు ఆయనకు, ఒక్క కూతురు తప్ప. ఆమె ఎక్కడో గుంటూరులో ఉంది. అప్పుడప్పుడు ఉత్తరాలు వ్రాసేది. వాటన్నిటికీ జవాబులు వాచాతే వ్రాయిస్తుండేవారు పంతులుగారు. బిడ్డంటే ఎనలేని ప్రేమ ఉన్నా ఒక్కసారయినా అటు పోలేదు. ఆమె తండ్రి వద్దకు రానూలేదు. సంగీత పాఠాలు చెప్పుకుంటూ గడుపుతున్నారు పంతులుగారు ఈ వృద్ధాప్యంలో.

## మూడవ బహుమతి

మరుసటిరోజు నేను వ్రాసిన మరొక క్రొత్త పాటకు బాణీలు కట్టి, నన్ను చిత్రహింస చేసి చివరికి జయప్రదంగా వినిపించారు.

"నా కన్నులలో దాగియుంటివి ప్రియతమా—
నే నెరుగ నీ మోము అదెట్లో హృదయమా—"

"రేపటిలోగా ఇంకా రెండు—మూడు పాటలు వ్రాయవోయి—!" పంతులుగారు నా భుజంమీద చేయివేసి అన్నారు.

"ప్రయత్నిస్తాను—!" అన్నాను.

ఇంతలో పోస్టు జవాన్ పంతులుగారికో కవర్ యిచ్చిపోయాడు. కూతురు వ్రాసి ఉంటుంది. పంతులుగారు కవర్ చింపి చదువుతుంటే మెల్లగా బయటపడ్డాను.

ఆ ఉత్తరానికి ప్రత్యుత్తరం వ్రాయటానికి ముప్పుతిప్పలుపెడ్తా రాయన. ఒకసారి వ్రాయించి, చదవమని చెప్పి—బాగాలేదనుకొని ఇంకోరకంగా వ్రాయిస్తారు. ఈవిధంగా ఒక్క ఉత్తరం గంటా గంటన్నరదాకా నైనా కనీసం వ్రాయవలసి వస్తుంది.

ఆరోజు రాత్రి భోంచేసి పడుకున్నాను. మరుసటిరోజు ఆఫీసులో ఏం చెయ్యాలో ఆలోచిస్తున్నాను.

"శేషూ—!" పంతులుగారి గొంతు దగ్గర్లో వినిపించింది.

"ఆఁ—!" వెనక్కి తిరిగి చూస్తే పంతులుగారు గుమ్మంలో నిల్చున్నారు. చేతిలో ఒక కవర్, ధోవతి, బనీను, కండ్లజోడుతో.

"రండి పంతులుగారూ—!" లేచి కూర్చున్నా మంచంమీద.

పంతులుగారు వచ్చి ప్రక్కనే ఉన్న కుర్చీ దగ్గరికి లాక్కున్నారు.

దీపం పెద్దది చేశాను.

పంతులుగారి కండ్లు ఎర్రగా ఉన్నాయి. తీవ్రంగా ఏదో విషయం ఆలోచిస్తున్నారు .... రెండు నిమిషాలలాగే కూర్చున్నారు.

"ఉత్తరం వ్రాయాలోయ్—!" అన్నారు.

ఎక్కడికో, ఎందుకో చెప్పే అలవాటు లేదాయనకు. అసలా సమయంలో వ్రాసే స్థితిలో లేను నేను.

"ఇప్పుడా—?"

తల ఊపారు—

"సరే—!"

రైటింగ్‌ప్యాడ్ తీసికొని కూర్చున్నా. "చెప్పండి!"

పంతులుగారు చెప్పటం ప్రారంభించారు.

"చిరంజీవి రాజకుమారిని మీ నాన్న దీవించి వ్రాయునది—"

పంతులుగారు ఒక్క నిముషం మౌనం వహించారు. ఎర్రబడ్డ కండ్లలోంచి కన్నీళ్ళు వెలుగులో తళుక్కుమన్నాయి.

అదిరిపడ్డాను.

## రు. 225 లు పొందిన కథ

"పంతులుగారూ—!"

"ఊఁ—వ్రాయి—!"

—"చిరంజీవి రాజకుమారిని మీ నాన్న దీవించి వ్రాయునది ఏమనగా—!"

"వ్రాశానండి—!"

"వ్రాశావా .... అయితే మళ్లీ వ్రాయి ....!" పంతులుగారు యీసారి ఆగకుండా చెప్పారు. వ్రాస్తూ కూర్చున్నాను.

—"అమ్మా ! రాజా !!—

నీ ఉత్తరం యివ్వాళే ముట్టింది. నిన్న వ్రాసిన ఉత్తరం చూసి మురిసిపోయాను. ఇవ్వాళ అందిన ఉత్తరం చూసి కంట తడి పెడ్తున్నాను. పద్దెనిమిది సంవత్సరాల తరువాత మళ్లీ ఈరోజున మీ అమ్మని జ్ఞాపకం చేసుకున్నాను. ఆనాడు ఆ మహాసాధ్వికి యిచ్చిన మాట ఈనాడు పూర్తి చేయలేక పోయాను. సంపాదిస్తుంది ఎక్కువ కాక పోయినా పరువుగా బ్రతుకుతూ ఒకళ్లచేత వేలెత్తి చూపించుకోవటం అసలు మన వంశానే లేకుండా పోయింది.

పండగలకు, పబ్బాలకు వస్తానన్నా వద్దని వ్రాశాడు ఈ నాన్న. మొండి ఇంట్లోకి, గాజుల్లేని సంసారంలోకి, దారిద్ర్యంలోకి నిన్ను తీసుకు రావటం యిష్టం ఉండక అలా వ్రాశాను. ఇవ్వాళ నీవు వస్తానంటే నే వద్దంటావా తల్లీ ....! కాని అలా కాదమ్మా .... పసుపు కుంకుమను చెదర గొట్టుకొని కాదు .... వెయ్యేండ్ల భవిష్యత్తుతో, సకల సంపదలతో .... మునిమళ్లతో .... ముని మనుమరాళ్లతో .... రావాలమ్మా .... !

ఇది చూడటానికే నే బ్రతికి ఉన్నానా ? నా బిడ్డ నొసట చెరిగిన బొట్టుని చూడటం నావల్ల కాదు.... నిర్దాక్షిణ్యంగా, హృదయంలేని వాడిగా వ్రాస్తున్నానని అనుకోకు .... ఒక తండ్రిగా .... తండ్రికుండే ఆశతో, ఆశయాలతో వ్రాస్తున్నాను .....

మనసు మార్చుకో రాజా ....! ఈ విపత్కర సమయంలో మీ అమ్మను తల్చుకో. నీకు ఏం చేయాల్సో తోస్తుంది. నీ మాంగల్యాన్ని రక్షిస్తుంది. ఆ తల్లి దీవెనలు పొందటానికి ప్రయత్నము చేయి.

మీ అమ్మ కూడా వద్దంటే వచ్చేసెయ్ .... !

మీ నాన్న,

కొండ్రావు."

కండ్లు తుడుచుకున్నారు పంతులుగారు.

వ్రాయటం పూర్తయింది. "చదవనా .... ?" అన్నాను.

"వద్దు లేషూ .... !" ఆయన తల వంచుకున్నారు. పంతులుగారి పరిస్థితిమీద నా కెంతో జాలి కలిగింది.

"పంతులుగారూ .... అసలేం జరిగింది—?"

"ఏమీ జరగలేదు—జరగబోతుంది—!"

# ప్రసాదం

"ఏమిటది ?"

పంతులుగారు సమాధాన మివ్వలేదు. మౌనం వహించారు. ఆ సమయంలో ఆయన్ను బలవంతం చేసి అడగటం భావ్యంగా ఉండదనుకున్నాను.

"వెళ్ళి పడుకోండి — రేపుదయమే పోస్ట్ చేస్తాను—!"

ఆయన వెళ్ళిపోయారు.

మరునటిరోజు ఉదయం ఆఫీసుకెళ్తూ— పంతులుగారి వాటావైపు వెళ్ళాను. తలుపు తెరుచుగా కుర్చీలో కూర్చుని ఉన్నారు పంతులుగారు. ఒక్క రాత్రిలోనే ఆయనెంతో క్షీణించి పోయారు. ఎంతో వృద్ధులుగా కనిపించారు.

ఎందుకైనా మంచిదని అడిగాను. "ఉత్తరం పోస్ట్ చెయ్యమంటారా ?" అని.

ఆయన నాకోసరమే ఎదురుచూస్తున్నట్లుంది— "లోపలికి రా .... !" అన్నారు.

వెళ్ళి కూర్చున్నా.

"అసలేం జరిగిందో నీకు తెలియదు కదూ !" అన్నారు.

"ఊహూ—!"

"నే చెప్పందే ఎలా తెలుస్తుంది—?" అంత బాధపడ్తూ కూడా పంతులుగారు నవ్వగలిగారు.

"రాజకుమారికి విడాకు లిస్తానంటున్నాడట అల్లుడు—!" అని ఆగి నావైపు చూశాడు.

"ఎందుకు ?"

"చెప్పింది విను — విడాకు లెందుకని అడగలేదు. రాజకుమారి ఒప్పుకుంది. నా దగ్గరికి వచ్చేస్తా నంటుంది. ఇక్కడ నా సలహా అడిగితే ఏం చెప్పాలి ? వద్దంటే ఏ నుయ్యో, గొయ్యో చూసుకుంటుంది. రమ్మంటే దాని జీవితం—? నే నున్నన్నాళ్ళు బాగానే ఉంటుందనుకో. తరువాత ఏమవుతుంది ? అరిటాకు, ముల్లు సామెతలా ఎటొచ్చీ కష్టాలపాలయేది రాజకుమారి. సంగతి సందర్భాలు కనుక్కోవాలి—!"

పంతులుగారిలో వైరాగ్యం కనిపిస్తోంది.

"చీకూ, చింతా లేకుండా కాలం గడుస్తుం దనుకున్నాను. బ్రతికి ఉన్నన్నాళ్ళు ఈ జంఝాటం తప్పదేమో—!"

"మరి నన్నేం చెయ్యమంటారు ?" నే నడిగాను.

"అదే నేనడిగేది — నన్నేం చేయమంటావు అని—!"

"మీ రొకసారి వెళ్ళిరండి అక్కడికి—పరిస్థితులు —చక్కబడ్తాయేమో !"

పంతులుగారు ఆలోచిస్తూ కూర్చున్నారు.

"నీవు వెళ్ళకూడదూ—?"

"నేనా? వెళ్ళి ఏం చేయగలుగుతాను ?"

"అక్కడికి నే వెళ్ళలేను శేషూ—నాకీ సహాయం చేయి—!" పంతులుగారు గభాల్న నాచేతులు రెండూ పట్టుకున్నారు.

ఆయన గొంతు వొణికింది.

"నే చేయలేంది నీవు చేస్తావు ....!"

"పంతులుగారూ .... !"

ఆయన కుర్చీలో వెనక్కు వాలిపోయారు — చిన్నపిల్లాడిలా వెక్కి వెక్కి ఏడ్చారు.

పంతులుగారు ఒక్కసారే ఇంతగా దిగజారి పోయేసరికి నా కెలాగో అనిపించింది. పంతులుగారి కోసం ఏమైనా చేయాలనిపించింది. కాని నిస్సహాయుణ్ణి — నేనేం చేయగలుగుతాను ! కూతురు యింటికి తిరిగి రావడం సహించలేరు. కూతు రింటికి పోయి అక్కడి అవజయాన్ని భరించ లేరు. అందుకనే కుమిలిపోతున్నారు.

"పంతులుగారూ—చూడండి. నేనక్కడికి వెళ్ళటంలో అభ్యంతరం ఏమీ లేదు. కాని, నేను వెళ్ళి ఏం చేయగలను ? అసలిలాంటి పరిస్థితిలో నే నెలా ప్రవర్తించాల్నో కూడా తెలీదు. పెద్దలు మీరు మీకు తోడుగా రమ్మంటే వస్తాను.!"

అనవసర భారాన్ని నెత్తిమీద వేసుకోవడానికి భయపడి అలా అనలేదు. అదొకరి జీవిత సమస్య— నేను కలుగజేసుకున్నప్పుడు, జరిగే ప్రతి మంచికీ— చెడుకీ కొంతవరకు బాధ్యుణ్ణవుతాను. 'మంచి' జరిగితే ఏ తంటా ఉండదు. జరిగేదేదో ఊహించనిదే అయి, కీడు సంభవిస్తే— ? అందులోనూ పంతులుగారి విషయంలో—

"శేషూ .... !" అన్నా రాయన గంభీరంగా.

"ఏమండీ .... !" అన్నాను.

"నే నక్కడికి వెళ్ళటం యిష్టంగా లేదు. నీ వక్కడ చేయవలసిందేమీ ఉండదనుకుంటా— వెళ్ళిరా—వెళ్ళ ....!"

పంతులుగారు ఈ లోకంలో లేరనిపించింది.

"మరి రాజకుమారి నన్ను .... !"

"అమ్మాయి పేరిట నేనో ఉత్తరం రాపిస్తాను !"

"మరి నేను .... !"

"ఇప్పాళే వెళ్ళు—!"

ఆఫీసుకు సెలవు చీటీ పంపించి, రెండు జతలు బట్టలు బ్యాగ్‌లో పెట్టుకొని మళ్ళీ వచ్చాను. పంతులుగారు ఒక కవరు నా చేతికిచ్చారు.

"నీ చెల్లెలి కాపురం చూడటానికి వెళ్తున్నావు!' పంతులుగారు మాట్లాడలేకపోయారు.

"అమ్మాయి ఎలా ఉందో చూసిరా—!" అన్నారు చివరికి.

"రేపు తిరిగి వచ్చేయనా ?"

"రావాలనిపిస్తే వచ్చేయి."

* * *

గుంటూరులో ఆ యింటిని గుర్తుపట్టడం నాకంత కష్టం కాలేదు.

ఇల్లు చిన్నదే—అయినా ఎంతో బాగుంది.

తలుపు తట్టాను—

"ఎవరు కావాలి ?"

"నేను రాజమండ్రినుంచి వస్తున్నాను. కొండలావుగారు పంపించారు !"

వెంటనే తలుపు తెరుచుకుంది.

సన్నగా, పొడుగ్గా ఉందామె. కండ్లు, ముక్కు పంతులుగారివే—రాజకుమారే నని అనుకున్నాను.

"నమస్తే—" అందామె. "లోపలకు రండి !"

చిన్న గది—రెండు కుర్చీలు, ఒక టేబుల్ ఉన్నాయి. కూర్చుని పంతులుగా రిచ్చిన ఉత్తరం యిచ్చాను.

చదువుకుంది.

ఆమె చదువుతున్నంతసేపూ తరువాత ఏం మాట్లాడాలో ఆలోచిస్తూ కూర్చున్నా.

"అయితే అన్నయ్యగా రన్నమాట—" నవ్వుతూ అంది రాజకుమారి.

పంతులుగారి ఉత్తరం ఇంత మంచి వాతావరణం ఏర్పరుస్తుం దనుకోలేదు. ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది. నిజంగానే నా చెల్లెలి యింటికొచ్చినంతగా ఆనందించాను.

"మరి ఇన్నాళ్ళెక్కడున్నారు—?"

"నాకిక్కడ ఒక చెల్లాయి ఉందని తెలిస్తే వెంటనే వచ్చేవాణ్ణి !"

నవ్వింది.

"ఉండండి—యిప్పుడే వస్తాను. అందాకా ఆ పేపరు చూస్తూండండి !" అంటూ రాజకుమారి పేపర్ నా చేతికిచ్చి మరో గదిలోకి పరుగెత్తింది.

మరొక అయిదు నిముషాలకే తిరిగొచ్చింది.

"వేన్నీళ్ళు తోడాను—స్నానం చేయండి !" అంటూ.

ఆమె కండ్లలో ఎంతో ఉత్సాహం కనబడింది.

అయిదు నిముషాలలో స్నానం ముగించి వచ్చాను.

టిఫిన్, కాఫీ రెడీగా ఉంచింది రాజకుమారి.

"మీవారు లేరా ?" అడిగాను.

"వారు వస్తారు—మీరు తీసుకోండి—!" ప్రక్కనే ఒక కుర్చీలో కూర్చుంది.

రాజకుమారిని చూస్తే ఒక దీర్ఘ రోగిలా కనిపిస్తోంది.

ఆమె కండ్లలో అవ్యక్తంగా మెదిలే బాధను చూడటం సహించలేకే రావడానికి సాహసించలేదు పంతులుగారు.

నేనే అన్నాను—"ఇక్కడి కొచ్చేటప్పుడు పంతులుగారేమన్నారో తెలుసా ?"

"ఏమన్నారు ?" అంది.

"నీ చెల్లెలి కాపురం చూడటానికి వెళ్తున్నావోయ్ అన్నారు ?"

రాజకుమారి సంతోషించలేదు. తల వంచుకుంది.

"నాన్నగారి కెలా ఉంటుం దిప్పుడు ?"

"ఆరోగ్యమా ? బాగానే ఉంటున్నారు. కాని అప్పుడప్పుడు చాలా తీవ్రంగా ఆలోచిస్తుంటారు. నేను సరిగ్గా గమనించలేదు గాని అన్నం, నీళ్ళు కూడా మానేసేవారట. ఎందుకనో అర్థం చేసుకోలేకపోయాను. తరువాత తెలిసింది కొంతవరకు."

"ఏం తెలిసింది ?"

రాని చిరునవ్వు బలవంతంపెట్టినా రాలేదు. ఆ ప్రయత్నం లీలామాత్రంగా మెరిసింది చిన్న బోతూ పెదాలమీద—

"నిజమేనేమో నని భ్రమపడిన అబద్ధం !"

"అంటే—!"

"నే నిక్కడ ఏం చూస్తానో అని భయపడ్తూ వచ్చాను. కాని యిక్కడ చూడవలసిందేమీ లేదనుకుంటాను !"

"మీరనలేమీ చూడలేరు—!"

"అంటే—?"

రాజకుమారి పత్రికను చేతిలో పట్టుకుని విసురుకుంటూంది.

"మీరు చూడాల్సింది ఇంకా ముందుంది!" అంటూ ఆ విషయానికి నవ్వే అవసరం లేక పోయినా నవ్వింది రాజకుమారి.

"అయితే నేను పొరపాటు పడ్డాను—!"

"సరే—నాన్నగారు రోజూ ఏం చేస్తుంటారు?"

"ఉదయమే లేచి స్నానపానాదులు ముగించి ఒంటిగంటదాకా ఇంటికొచ్చిన పిల్లలకు సంగీతం పాఠాలు చెప్తారు. తర్వాత తమకు తామే చెప్పు కుంటూ కూర్చుంటారు. విశేషించి ఇంకేమీలేదు!"

"మీరేం చేస్తున్నారు ?"

"నాన్నగారు ఉత్తరంలో వ్రాయలేదా ?"

"వ్రాస్తే ఎందు కడుగుతాను ? మీ పేరు కూడా వ్రాయలేదు!"

"మరేం వ్రాశారు!"

"'మీ అన్నయ్యను పంపుతున్నాను —' అని వ్రాశారు !" నవ్వింది రాజకుమారి ఎంతో గర్వంతో.

ఎంతో ఆశ్చర్యపోయాను. నే నిన్నాళ్ల పంతులు గార్ని ఏమాత్రం అర్థం చేసుకోలేదు. పంతులు గారు ప్రతి మాటలోనూ ధీమా, అధికారం ధ్వనించేయి. కారణం ఇదే కావచ్చు. పంతులు గారు ఆ క్షణం నుంచి నాకు ఇంకా ఎంతో పూజ్యులై పోయారు.

"నా పేరు కాశీనాథ్—పంతులుగారు శీనూ అంటూ పిలుస్తుంటారు. బి. ఏ. ప్యాసయ్యాను. ఉద్యోగం—!"

"అన్నయ్యగారు వకీలనుకున్నాను !"

నవ్వి వూరుకున్నాను.

"కాఫీ చల్లారుతోంది !" అంది.

కాఫీ త్రాగాను.

అడిగాను—"వారిని గురించి పరిచయ మివ్వ టంలో మీ కెమైనా అభ్యంతరమా ?"

"వారు మీకు స్వయంగానే పరిచయ మవుతారు !" అంటూ నవ్వింది.

నేను బదులు పలకలేదు.

"రాజమండ్రి విశేషాలింకేమున్నాయి ?"

"ఏముంటాయి —అంతా క్షేమం. మేమంతా వేరేవేరే వాటాల్లో ఉంటున్నా ఏకోదరులంగానే ప్రవర్తిస్తాం.... అయినా ఇంకేం చెప్పమంటారు?"

గాజులు లెక్కపెడ్తూ కూర్చుంది రాజ కుమారి.

"వదినెగారి పేరు—?"

వెంటనే అర్థంకాలేదు. "ఏ వదినెగారు ? ఓహో ! ఆ ప్రాప్తం ఇంకా కలగలేదు. ఇంకా బ్రహ్మచారినే .... !"

రాజకుమారి వాళ్ల పూర్వగాథ అంతా చెప్పు కుంటూ వచ్చింది. రాజకుమారి పుట్టిన రెండు, మూడు నెలలకే తల్లి పోయింది. తండ్రే తల్లి అయి పెంచాడు. సంపాదించుకున్నదంతా ధార పోసి పెండ్లి చేశాడు. కాని, చివరికి ఎన్నో ఆశలు పడ్డ పంతులుగారు ఆశలు అడియాశ లవుతున్నా యని దుఃఖించింది.

"మీరు నాన్నగారి క్షేమని వ్రాశారు ఉత్త రంలో ?" అడిగాను.

"ఎప్పుడు—?"

"క్రితంసారి—!"

కండ్లలో నీళ్లు తిరిగాయి రాజకుమారికి—

"సరే ! బయటికి వెళ్లి వస్తాను—!" అన్నా, బలవంతం చేయడం ఇష్టంలేక.

"చీకటి పడకముందే వచ్చేయండి. కుక్క లున్నాయి ఈ వీధిలో—!" కన్నీళ్లు తుడుచు కుంటూ, కొంచెం నవ్వుతూ అంది.

"అలాగే—!" అంటూ బయలుదేరాను.

* *

మళ్లీ ఇంటి కొచ్చేసరికి ఎనిమి దయింది.

హాల్లో దీపం వెలుగుతుంది. మెట్ల దగ్గర నిల్చొని చూస్తోంది రాజకుమారి.

నేను వెళ్లిం తరువాత స్నానంచేసి ఉంటుంది తెల్లని వాయిల్ చీరె కట్టుకుంది — కుంకుమ బొట్టు పెట్టుకుంది.

"నా కోసమే చూస్తున్నారా ?"

అవునన్నట్లు నవ్వింది.

లోపలికెళ్తూ అడిగాను—"మీవారు వచ్చారా ?" అని.

"రాలేదు — ఇప్పుడే రారు—!"

ప్రక్క గదిలో కెళ్లి బట్టలు మార్చుకుని వచ్చాను.

"అన్నం వడ్డిస్తాను — కాళ్లు చేతులు కడు క్కోండి—!" వంటింటి తలుపు నానుకొని నిల బడి ఉంది రాజకుమారి.

"వారిని రానియ్యండి—అతిథి మర్యాద కాదు!" నవ్వుతూ అన్నాను.

"వారిప్పుడే రారని చెప్పాగా. రాత్రెప్పుడో వస్తారు—!"

"ఏం—?"

"అలవాటు—!"

"సరే" నన్నాను.

భోజనం చేయటం పూర్త య్యేసరికి తొమ్మి దయింది.

వసారాలో ఒక మూల చివరన మంచం వేసింది రాజకుమారి.

వెళ్లి పడుకున్నా.

అంతవరకు నేనుగా చూసింది మననం చేసు కుంటున్నాను.

రాజకుమారి కే లోటూ లేదు. సంసారం సుఖ ంతంగానే ఉన్నట్లుంది. మరి విడాకుల సమస్య ఎందుకు రేకెత్తిందో వీళ్ల మధ్య ఊహించడం సాధ్యంకాకుండా ఉంది. ఆయనగారిని చూసిం తర్వాతగాని ఒక నిర్ణయానికి రావటం సాధ్య పడేదేమో !

రాజకుమారిని ఈ విషయం అడిగితే సముద్రం పొంగి పొరలుతుంది— పంతులుగారు తన బిడ్డ ఎలా ఉందంటే ఏం చెప్పాలి ?"

ఒక శోకదేవతలా ....

కన్నీటి సముద్రంలా ...... లేక

రాజకుమారిలా — ఉందని చెప్పాలా ?

పంతులుగారి ఏకైక సంతానం రాజకుమారి. తను రెండేండ్లనుండి చూస్తున్నాడు — ఒక్క సారైనా ఆవిడ తండ్రి దగ్గరికి రాలేదు. ఉత్తర ప్రత్యుత్తరాలు తప్ప నేరేదేమీ లేదు.

పంతులుగారికి ఇంకా ఏమేం చెప్పాలో ?

తన కూతురు సంసారం గురించి అడుగుతా రాయన.

ఒక్క రోజులో ఏం అర్థం చేసుకుంటాడు. తను మాత్రం ? అయినా సంసారాని కేముంది? అద్దంలాంటి ఇల్లు—

అంతకన్న స్వచ్ఛమైన హృదయం కల ఇల్లాలు.

సంసారంలో ముఖ్యంగా ఉండాల్సినవి—ఇల్లు, ఇల్లాలు—పోతే యిక ఆమె భర్త సంగతి ? తను ఆయన్ని చూడలేదు. కనీసం అతనిని గురించి వివ రైనా వినలేదు. స్వయంగా ఎలా పరిచయ మవు తాడు ?

ఆలోచిస్తూనే నిద్రపోయాను.

ఓ అర్థరాత్రి మెలకువ వచ్చింది.

లోపలినుండి మాటలు వినిపిస్తున్నాయి. ఒక కంఠం రాజకుమారిది, మరొకటి మొగ గొంతు. బహుశా భర్త కావచ్చు. తాగి వచ్చిన మనిషిలా మాట్లాడుతున్నాడు.

'ఊరుకోండి ! ఆయన బయట పడు కున్నారు. మీ అల్లరి విని నిద్ర లేస్తారు—" రాజకుమారి అంటూంది.

"అసలత నెవరు నా యింటికి రావటానికి ? బయటి కెళ్లిపొమ్మను. అన్నట, అన్న. రోగిష్టి దానికి రోగిష్టి అన్న—!"

"ఛీ—!"

కొంతసేపు నిశ్శబ్దం—

మళ్లీ ఆయన కంఠం వినిపించింది.

"వెళ్లమని చెప్తావా ? నాల్గు తన్ని నేనే వెళ్ల గొట్టాల్నా ?" గర్జిస్తున్నాడు.

"ఎందుకెళ్తారు ? నాకోసం వచ్చారు వారు !"

"అసలు నువ్వెవరివి మాట్లాడటానికి ?"

"మీ భార్యను—కట్టుకున్న భార్యను !"

"షటప్ ! రేపు వెళ్లిపోయే దానిని !— నీలాంటి మూర్ఛరోగిని ఉంచుకోవడమే నాకు నామర్దా ! ఇంకా భార్యవనే బిరుదా నీ మొహానికి !"

రాజకుమారి ఏదో అనబోయింది.

ఛెళ్లుమని చప్పుడైంది.

కొడుతున్నాడు వెధవ—రాజకుమారిని—సంగీత పంతులుగారి కూతుర్ని—నేనేదో నా బాధ్యతను విస్మరిస్తున్నట్లనిపించింది.

"వెధవను బైటికి లాగి పడేస్తాను !" అంటున్నా డాయన రొప్పుతూ.

రాజకుమారి తలుపు కడ్డంగా నిల్చో నుండ వచ్చు. తలుపు చప్పుడైంది. తరువాత రాజ కుమారి మూలిగినట్లు చప్పుడు.

"నీ బొమికలు విరగ తంతా—నా కడ్డురాకు !"

'ఆ కొట్టేదేదో రేపు విరగ్గొట్టండి. రేపాయన వెళ్లిపోతారు. మీ కాళ్లు పట్టుకుంటాను !"

"ఛ ! వెధవ ..... !" వీపుమీద 'ఫట్' మని కొట్టినట్లు చప్పుడు.

లేచి కూర్చున్నా—

లాభంలేదు. నేను జోక్యం కలుగజేసుకోవాలి.

తన్ని చంపేస్తాడా దేవతను ? తలుపుదాకా వెళ్లాను. అయినా ఏదో అదృశ్యశక్తి వారించింది

న్ను. పంతులుగారి మాటలు జ్ఞాపకం వచ్చాయి.

"నీ వక్కడ చేయవలసిం దేమీ ఉండదు !"

పంతులుగారు నన్ను బంధించివేశారు.

ఇటువంటి దేదో జరుగుతుందని వారికి ముందే తెలుసునేమో !

లోపల రాజకుమారి ఏడుస్తోంది.

మూలుగు ఇంకా స్పష్టంగా వినబడ్తూంది.

"అయ్యో పంతులుగారూ—లోపల రాజకుమారి విలపిస్తుంది. ఇప్పుడైనా నన్ను బంధ విముక్తుణ్ణి చేయండి !' లోలోన కేకేశాను.

చేతకాని అన్నను సంపాయించి యిచ్చారు పంతులుగారు తన బిడ్డకు. కన్నీరు మున్నీ రయ్యాను రాత్రల్లా.

రాజకుమారి కంటే నేనే ఎక్కువ విలపించా నా రాత్రి.

* * *

తెలతెలవారుతుండగానే ఆయన బయటికి వెళ్ళిపోయాడు. అస్పష్టంగా చూశాను. చాలా పొడుగ్గా ఉన్నాడు. నడక ఎక్కడో చూసినట్లు గుర్తు.

కాఫీ తెచ్చింది రాజకుమారి.

"నా కలవాటు లేదు. ముఖం కడుక్కున్న తరువాత త్రాగుతాను !"

రాజకుమారి తీసుకెళ్ళిపోయింది.

విచారాన్ని సూచించే ఛాయలు ఏమీ కనిపించలే దామెలో. ఎంతో మామూలుగా ఉంది.

ముఖప్రక్షాళనం చేసివచ్చి కాఫీ త్రాగుతూ అడిగాను.

"ఆయన వెళ్ళిపోయారా ?"

"ఆఁ—!"

"నాతో మాట్లాడటం యిష్టంగా లేదేమో!"

నవ్వింది రాజకుమారి.

"మిమ్మల్ని అడిగినట్లు చెప్పమన్నారు !" ఎంతో తేలిగ్గా చెప్పింది. రాజకుమారి ఈ విషయం. రాత్రి ఏమీ జరగనట్లే మాట్లాడింది

"సంతోషం—నేను వెళ్తున్నాను !"

"అప్పుడే—?"

"వెళ్ళాలి. మళ్ళీ ఎప్పుడైనా వస్తాను. అక్కడ పంతులుగారు నాకోసం ఎదురుచూస్తుంటారు."

రాజకుమారి మౌనం వహించింది.

వెళ్ళబోతూ అడిగాను—"ఏం చెప్పమంటారు ?"

నేల చూపులు చూస్తూ అన్నది—"ఉత్తరంలో వ్రాసిన విధంగా జరగదని చెప్పండి .... !" కన్నీళ్ళు నేలమీద కురిశాయి.

"వెళ్తున్నాను— శెలవు !"

గుమ్మందాకా నడిచాను.

"అన్నయ్యా !"

వెనక్కి తిరిగి చూశాను. ఎంత బాగుందా పిలుపు ? రాజకుమారి పిలిచింది. తన మనసు లోని ప్రేమంతా అమృతంగా మార్చి ఆ పిలుపులో వింపింది.

"అపార్థం చేసుకున్నావా అన్నయ్యా ?"

"లేదు .... చెల్లాయి .... లేదు .... !" బయటికి సరిగా రాలేదు నా మాటలు. గబగబా వీధి లోకి నడిచాను.

ఇంకా రాజకుమారి ఏడ్పు వినిపిస్తూంది.

* * *

# ప్రసాదం

రైలులో కెక్కి కూర్చున్నా.

ఆపుకుందా మనుకున్నా దుఃఖం ఆగలేకుండా ఉంది. ఎక్కడికో ఏకాంతంలోకి వెళ్ళి తనివితీరా ఏడ్వాలనిపించింది.

అవంతటవే కన్నీళ్ళు జాలువారుతున్నాయి.

"ఏమండి !" ఎవరో పిలుస్తున్నారు ప్లాట్ ఫారంమీద నిలబడి ఉన్నాడు.

కిటికీలోంచి తొంగిచూశాను.

ఆయనేదో చెప్తున్నాడు నన్ను చూస్తూ. ఎక్కడో చూసినట్లుంది—చిందరవందర జుట్టు.

"క్షమించాలి మీరు ... నన్ను .... మీరు—" అతను స్పష్టంగా చెప్పలేకపోయాడు.

ప్రశ్నార్థకంగా చూశాను.

"నేను లోకేశ్వర్‌రావును. రాజకుమారి భర్తను .... రాత్రి జరిగిన గొడవకి ఎంతో విచారిస్తున్నాను !"

ఆయన చెప్పేది వెంటనే గ్రహింపుకు రాలేదు.

"ఏం చెప్తున్నాడు ? ఎవరాయన ? ? తను అతన్ని క్షమించాల్నా—?"

ఆయన చెప్తూనే ఉన్నాడు.

మూడవ

బహుమతి

కథ

" .... చాలా విచారిస్తున్నాను. మీరు నన్ను క్షమించాలి !"

రైలు కదిలింది. ఆయనక్కడే నిలబడి పోయాడు

"మీరు లోకేశ్వర్‌రావుగారా ?" పెద్దగా కేకేశాను.

అప్పటికే పది గజాల దూరమయ్యా డతను. ఆ దూరంలో నిలబడి 'అవును' టూ తల వూపాడు.

రైలు మరీ దూరమై పోయింది.

ఎంత చిత్రమైన మనిషి ?

లోకేశ్వర్‌రావా యిప్పుడు తనతో మాట్లాడింది ? చాలాసేపటి వరకు కోలుకోలేకపోయాను.

రాజకుమారి భర్త నా దృష్టిలో క్రూరుడు, కఠినాత్ముడు—కాని, అదిప్పుడు పూర్తిగా తారుమారై కూర్చుంది.

క్షమాపణల్ని మోసుకొచ్చా డాయన.

పంతులుగారు వెంటనే గుర్తుకొచ్చారు. ఆయనతో ఏం చెప్పాలి ?

రాజకుమారి హీనస్థితి—ఆయన అల్లుడుగారి మంచితనం— ఒకటే తోచింది ....

మంచితనపు ముసుగులో లోకేశ్వర్‌రావు వికృత స్వరూపం.

రాజకుమారి గుండెలోనిండా పగిలిన మంచితనపు అమృతభాండాలు—

గుండె బరువెక్కింది.

"నీ చెల్లెలి కాపురం చూడబోతున్నావు శేషూ!" అన్నారు పంతులుగారు. అసలు నేను చూసిం దేమిటి ? నాకేం అర్థంకాలేదని చెప్పాల్నేమో ఆయనతో

తన బిడ్డ కాపురం చిన్నాభిన్న మవుతుందన్న భావాన్నయినా పంతులుగారు భరించలేరు. అందు కనే ఆయన కూతురు వద్దకు రాకుండా ఉండటానికి కారణం—ఆయనేదీ భరించలేడు. కనీసం నేను చెప్పబోయే మాటలనైనా భరించలేడు.

పంతులుగారు నాకోసం నిరీక్షిస్తూంటారు.

వేయి గుండెల దడ దడలతో నాకోసం ఎదురు తెన్నులు చూస్తుంటారు..... కావిరి నిండిన కండ్లతో సతమత మవుతుంటారు.

పంతులుగారి స్మృతి నా బాధాశ్రువుల్లో సంతోషాన్ని చిమ్మింది.

* * *

స్టేషన్ నుంచి ఇంటికి చేరుకునేసరికి చాలా ఆలస్యమైంది. దూరంనుంచే చూశాను....

గేటుదగ్గర చాలామంది నుంచొని ఏదో చూస్తున్నారు.

పరుగెత్తాను.

అక్కడి భీతావహ దృశ్యాన్ని చూసి స్తంభీభూతుణ్ణయ్యాను.

పంతులుగారిని పీటమీద కూర్చోబెట్టి, చెరొకవైపు మనుష్యులు పడిపోకుండా పట్టుకొని నీళ్ళు పోస్తున్నారు.

పంతులుగారి శవం అది—

తల ఎటంటే అటే వాలిపోతుంది.

"పంతులుగారూ—"పెద్దగా కేకేశాను.

ముందుకు పరుగెత్తబోతే ఎవరో పట్టుకున్నారు.

మరింకెవరో అంటున్నారు.

"ఇంకెక్కడి పంతులుగారు—?"

"వారి కష్టాలు ఈనాటికి పూర్తయ్యాయి !"

"అయ్యో పంతులుగారూ—నన్నటు పంపించి మీరిటు వెళ్ళిపోయారా ? అందుకేనా నన్ను పంపించింది !"

పంతులుగారివా రూపంలో చూడలేక భోరున యేడ్చాను.

"పంతులుగా రెంతపని చేశారు ?"

"ఎలా ఇంతమందిని వదిలి వెళ్ళిపోగల్గారు ?"

పంతులుగారు జీవితంలో తనని నమ్ముకున్న వాళ్ళకేనాడూ అన్యాయం చేయలేదు. వారి ఏకైక ఆశ—ఆస్తి—రాజకుమారి. ఇన్నాళ్ళు రాజకుమారే పంతులుగారి బాధ్యత. అందుకనే యిన్నాళ్ళు జీవించి ఉన్నారు. ఆ బాధ్యత వేరొకరి కిచ్చివేసి పరలోకగతు లయ్యారు.

నిశ్చయ మరణం వారిది..... తృప్తితో చివరి శ్వాస పీల్చిఉంటారు.

పంతులుగారి బాధ్యత నా బాధ్యతైంది.

ఈ పవిత్రమైన బాధ్యతను ప్రసాదంలా నాకోసం మిగిల్చారు పంతులుగారు! ★